కాత్యాయనీ నమోస్తుతే

ప్రముఖ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు హనుమద్గిరి పద్మాక్షి ఆలయం, ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయాల్లో అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరీ దేవికి లక్ష గాజులతో ప్రత్యేక పూజలు, నవగ్రహ సహిత మహా చండీయాగం నిర్వహించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. అమ్మవారిని నెమలి వాహనంపై ఊరేగించారు.

– న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం, హనుమకొండ చౌరస్తా, ఐనవోలు



ఐనవోలులో..




వేయిస్తంభాల గుడిలో ఎంపీ కావ్య తదితరులు



పద్మాక్షి ఆలయంలో..

గురుతర బాధ్యత మీదే..!



జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301

● జిల్లా ● స్కూల్‌అసిస్టెంట్లు ● ఎస్జీటీ ● భాషాపండితులు ● పీఈటీ ● స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్ఏ) ● స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్జీటీ) ● మొత్తం

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు

ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..


ఈనాడు, మహబూబాబాద్–న్యూస్‌టుడే, భూపాలపల్లి



హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

భవానీమాతగా భద్రకాళి అమ్మవారు





ఉత్సవమూర్తికి సాలభంజిక సేవ

భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆరో రోజు భవానీ మాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యాహ్నికం, అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవారిని భవానీ మాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. కాత్యాయని దుర్గార్చన, చిన్న అమ్మవారికి గంధోత్సవం చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సాలభంజిక సేవ చేపట్టారు. – న్యూస్‌టుడే, రంగంపేట

ఒలింపిక్ పతకం ఇదే..!



హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మంగళవారం పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు దీప్తితో స్వీయ చిత్రాలు తీసుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో సాధించిన కాంస్య పతకాన్ని చూస్తూ బాలికలు మురిసిపోయారు. కుటుంబ సభ్యులతో కలెక్టరేట్‌కు వచ్చిన దీవాంజి దీప్తిని, తల్లిదండ్రులను కలెక్టర్ ప్రావిణ్య అభినందించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. మరిన్ని అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. – న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్, వరంగల్ క్రీడావిభాగం

బీసీ హక్కుల సాధనలో క్రియాశీలక పాత్ర పోషించాలి

న్యాశాయంపేట, న్యూస్‌టుడే: బీసీల హక్కుల సాధనలో అధ్యాపకులు క్రియాశీలక పాత్ర పోషించాలని బీసీ జేఏసీ ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. మంగళవారం హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ డిగ్రీ కళాశాలలో వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆచార్య విజయ్‌బాబు మాట్లాడుతూ సమాజ మార్పునకు కృషి చేసే ఉపాధ్యాయులు రేపటి తరం కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య గడ్డం భాస్కర్, పులి శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ మోటే చిరంజీవి, క్రాంతికుమార్, సుమన్, మహేందర్, సతీష్, ఆచార్య సాంబయ్య, అనిల్ లక్ష్మణ్, వివేకానంద పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు విస్తృత ఏర్పాట్లు

రంగంపేట, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో సద్దుల బతుకమ్మ పండగకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. వరంగల్ భద్రకాళి, హనుమకొండ వడ్డేపల్లి చెరువును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, శివనగర్, రంగశాయిపేట బెస్తం చెరువు, ఖిలావరంగల్ గుండు చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న, గణేశ్‌నగర్, ఉర్సు రంగసముద్రం, కాజీపేట బంధం, హనుమకొండ పెద్ద వడ్డేపల్లి చెరువుతో పాటు విలీన గ్రామాల్లోని చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించామన్నారు. బతుకమ్మ ఆడే మైదానాల చదును, విగ్రహాలకు రంగులు వేయడం, విద్యుద్దీపాల పనులు చేపడుతున్నామని మేయర్ సుధారాణి తెలిపారు.

● ఈ నెల 12న భద్రకాళి తటాకంలో జరిగే భద్రకాళి భద్రేశ్వరుల తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు మేయర్ సుధారాణి తెలిపారు. ఉర్సు రంగలీలా మైదానంలో జరిగే రావణ వధ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

రామ రామ ఉయ్యాలో..!



కలెక్టరేట్‌లో బతుకమ్మలతో ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్య, ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, టీఎన్జీవోస్ అధికారులు



గ్రేటర్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ, మేయర్ సుధారాణి, కార్పొరేటర్లు

వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆడిపాడారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు ప్రావిణ్య, సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ, మహిళా కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను సుందరంగా అలంకరించి, చుట్టూచేరి ఆడిపాడారు.

– న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్, కార్పొరేషన్




మహిళా ఉద్యోగుల సందడి..

నేడు హైదరాబాద్‌కు డీఎస్సీ అభ్యర్థులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 187 ఉపాధ్యాయ పోస్టులకు గాను డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 169 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 2 నుంచి 5 వరకు ధ్రువపత్రాలను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారులు.. సోమవారం అర్హుల జాబితాను పాఠశాల రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. మంగళవారం సాయంత్రం తుది జాబితా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎంపికైన వారికి సమాచారం పంపించామని, బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందించనున్నట్లు డీఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు లేకపోవడంతో 18 పోస్టులు మిగిలాయన్నారు. డీఎస్సీలో ఎంపిక అయినవారు బుధవారం ఉదయం 7 గంటలకు కలెక్టరేట్‌కు రావాలని, ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తీసుకెళ్తామని చెప్పారు.

ఎక్సైజ్ కాలనీలో దుర్గంధం



కాల్వల్లేక రోడ్డు పక్కన పారుతున్న మురుగు



వీధిలో పేరుకుపోయిన చెత్త

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ నడిబొడ్డున మూడు దశాబ్దాల కిందట ఏర్పడిన ఎక్సైజ్‌కాలనీలో ఇప్పటి వరకు పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఎవరికి వారు సొంత డబ్బులతో ఇళ్లముందు కొంత వరకు కాల్వలు నిర్మించుకుంటున్నారు. కాల్వలు లేనిచోట మురుగు వీధుల్లో రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని విమర్శిస్తున్నారు. కాలనీలో చాలా వరకు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి, విష కీటకాలు తిరుగుతున్నాయి.

కోతుల బెడద..

కాలనీలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. పచ్చదనం, పర్యావరణం కోసం ఇళ్ల ముందు, రోడ్ల పక్కన చెట్లు పెంచుకున్నారు. కోతులు గుంపుగా వచ్చి చెట్ల కొమ్మలను ధ్వంసం చేయడంతో పాటు ఇళ్లలోకి వచ్చి నానా హంగామా చేస్తున్నాయి. చేతికి అందిన వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. అదిలించబోతే మీదకు వస్తున్నాయి. వాటిని పట్టుకొని అటవీ ప్రాంతాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ప్రావిణ్య మంగళవారం పరిశీలించారు. వైద్య రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయని, వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో మందులు, ల్యాబ్, ఫార్మసీ, స్టోర్ రూములు, వసతులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డీఎంహెచ్‌వో డా.లలితాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డా.గోపినాథ్, ఆయూష్ వైద్యాధికారి డా.జగదీశ్‌ప్రసాద్, యూడీసీ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన..

ధర్మసాగర్‌లోని శాఖా గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించి, అక్కడి సదుపాయాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. దీనికి కావాల్సిన అదనపు వనరుల వివరాలతో ప్రతిపాదనలు పెట్టాలని పరిశీలించి, కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. డీటీవో శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కుడా.. బడా!

● పరిధి పెంపునకు ప్రతిపాదనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సరసన త్వరలో వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) నిలవనుంది. దీని పరిధి విస్తరించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపించారు. త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉంది. 'కుడా' పరిధి పెంపుతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పెరిగే అవకాశాలున్నాయి. అనంతరం గ్రేటర్ వరంగల్ పరిధి పెంపుపై నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం పెద్దది. నగర విస్తరణతో పాటు సమగ్రాభివృద్ధి కోసం ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధమవుతోంది.

ప్రస్తుతం ఇలా..

● 'కుడా' విస్తీర్ణం 1805 చదరపు కిలో మీటర్లు

● వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాలు, 181 గ్రామాలు

● **మండలాలు:** భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, కాజీపేట, ఖిలావరంగల్, వరంగల్, వేలేరు, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం, వర్ధన్నపేట, చిల్పూరుగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్

ఎమ్మెల్యేల సుముఖత

'కుడా' పరిధి పెంపునకు స్థానిక ఎమ్మెల్యేలు సైతం అంగీకరించినట్లు తెలిసింది. అధికారికంగా లేఖలు కూడా ఇచ్చారని సమాచారం. గతనెల హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

కొత్తది ఇలా..

● కొత్తగా 1050 చదరపు కిలో మీటర్ల విస్తరణ


● అదనంగా మరో 8 మండలాలు, 95-100 గ్రామాల విలీనం

● జనగామ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, హుజూరాబాద్ పురపాలక సంస్థలతో పాటు 8 మండలాలు ప్రతిపాదించారు.

● జనగామ, హుజూరాబాద్ మండలాలు 'కుడా'లో కలిపేందుకు ప్రజాప్రతినిధుల నుంచి కొంత వ్యతిరేకత ఉందని తెలిసింది.

● 'కుడా' పరిధి పెంపునకు సంబంధించిన అన్ని రకాలైన మ్యాప్‌లు, ఇతర వివరాలు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించారు. మున్సిపల్ శాఖ సీఎం వద్ద ఉండటంతో ఒకే సారి రెండు ఆమోదాలు లభిస్తాయని అధికారులంటున్నారు.

వీడియో కాల్ చేస్తారు.. కొల్లగొడతారు!



● కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

కొత్త దారులు వెతుకుతూ..

సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా లింక్‌లు పంపించి, మల్టీలెవల్ మార్కెటింగ్, ఓటీపీ సంఖ్యలు తెలుసుకొని లేదా డెబిట్, క్రెడిట్ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నాడని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని. లేదంటే అరెస్టు తప్పదనేసరికి తల్లిదండ్రులు ఆందోళన చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంక్‌లు, వివిధ సంస్థలు, మాల్స్ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళలతో కొన్ని నెంబర్లకు ఫోన్ చేయించి వివరాలు తెలుసుకొని కొద్దిరోజుల తర్వాత సైబర్ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

'హలో మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం'.. అంటూ వీడియో కాల్ వస్తుంది. అందులో సీబీఐ కార్యాలయం, బోర్డులు కనిపిస్తాయి. మాట్లాడేవారు ఖాకీ దుస్తుల్లో ఉంటారు.. మీ అబ్బాయిని అరెస్టు చేశామనో, లేదా మీరు హవాలా మార్గంలో పెట్టుబడి పెట్టినందుకు కేసు నమోదు చేసి.. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మొదట బెదిరిస్తారు. ఆ తర్వాత కేసు నుంచి బయటపడాలంటే అడిగినంత ఇవ్వాలంటూ రూ.లక్షల్లో డిమాండు చేస్తారు. ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో అనేక మందికి ఇలా వీడియో కాల్స్ వచ్చాయి. సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలా అనేక రకాల పేర్లతో సామాన్యులకు వీడియోకాల్ చేసి బెదిరిస్తూ రూ.వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నారు.

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్, పోలీసు కాల్స్ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్ కార్డు నంబర్లు చెప్పవద్దు.. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

మన దగ్గర అనేక ఘటనలు

● గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి భయపడి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.

● మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన ప్రొఫెసర్‌కు ఈడీ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.

● హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియో కాల్ వచ్చింది. ఆమె ఫోన్ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నాం, మీ అబ్బాయిని మరో నేరంలో అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగు తిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్ కాల్ అని పెట్టేశారు.

● పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైందని, ఢిల్లీలోని కార్యాలయానికి వచ్చి విచారణ ఇవ్వాలని వాట్సాప్‌కు కొన్ని పత్రాలను పంపించాడు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్‌లో వీడియో కాల్ కేసులు : 41

మొత్తం సైబర్ కేసులు 748

ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్ కేసులు 1215

మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్ 1930



సైబర్ నేరాలపై వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కార్గో పార్శిల్, కొరియర్ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్ వద్ద టీటీఐ అధికారులు తనిఖీ చేసారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా కార్గో ద్వారా బుకింగ్ అయి వస్తున్నాయని చెప్పారు. వాటికి సంబంధించిన రశీదు లేకపోవడంతో మూటలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారికి విధులు అప్పగించకుండా విచారణ జరిపించాల్సిన డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకులు రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెపుతున్నారు. కార్గో బుకింగ్ చేయని ఎలాంటి వస్తువులు, పార్శిల్ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లకు ఛార్జిషీట్ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్ జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్ అథ్లెటిక్స్, 2026లో ఏషియన్ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్ రికార్డు నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు సన్వి



వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హనుమకొండ నయింనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్ఆర్వో శంకర్, సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

పేదలకు అందని 'డబుల్' ఇళ్లు



కమలాపూర్‌లో నిర్మించిన గృహ సముదాయం

కమలాపూర్, న్యూస్‌టుడే: నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో గత భారాస ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. కమలాపూర్ మండలానికి మొత్తం 790 ఇళ్లు మంజూరు కాగా.. కమలాపూర్‌లో 320, మరిపల్లిగూడెంలో 50, గూడూరులో 50, జర్నలిస్టులకు 30 చొప్పున నిర్మించారు. వాటిలో మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించలేదు. ఇప్పటి వరకు విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ, నీటి సదుపాయం కల్పించలేదు. వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. చీకటి పడితే మందుబాబులు, గంజాయి తాగేవారు అక్కడికి చేరుతున్నారు. కమలాపూర్‌లో ఇతర రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం వలస వచ్చినవారు ఇంటి అద్దెలు కట్టలేక రెండు పడక గదుల ఇళ్లలో ఉంటున్నారు.

చెట్టు నరికివేతపై నిరసన



నరికివేసిన చెట్టు వద్ద నిరసన తెలుపుతున్న పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట విష్ణుపురిలో ఒకరు తన ఇంటికి అడ్డుగా ఉందని మంగళవారం చెట్టును నరికేశారు. దీనికి పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ నిరసన తెలిపారు. పర్యావరణానికి ఆయువు పట్టువైన చెట్టును నరికివేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 51ఏ1జీ ప్రకారం పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని గుర్తు చేశారు.

గ్రేటర్ ఒప్పంద కార్మిక ఐకాస ఏర్పాటు




కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ ఒప్పంద కార్మికుల ఐకాసను మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విడుదల చేశారు. ఒప్పంద ఉద్యోగ, కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వక్కల రాణాసాగర్, వర్కింగ్ అధ్యక్షులుగా సుద్దాల కుమార్, కుమార్, రవి, యుగేందర్, సురేందర్, కోశాధికారులుగా రాము, అరుణ్‌లను ఎన్నుకున్నారు.

దూరవిద్యలో పునః ప్రవేశాలకు అవకాశం

విద్యానగర్: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో అందిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సుల్లో గతంలో ప్రవేశాలు పొంది మధ్యలో ఆపేసిన వారికి పునః ప్రవేశ అవకాశం కల్పిస్తున్నట్లు దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వి. రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానం అమల్లోకి వచ్చిందని, అందువల్ల గతంలో వివిధ డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలు పొందిన వారికి కోర్సులు పూర్తి చేయడానికి నిర్ణీత వ్యవధి ఉండటంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆస్ట్రేలియాలో హనుమకొండ యువకుడికి అవార్డు



ప్రీతం

హనుమకొండ కలెక్టరేట్: ఆస్ట్రేలియాలో హనుమకొండకు చెందిన యువకుడు అవార్డు అందుకున్నారు. నయీంనగర్‌కు చెందిన ఆకుల నరేష్ కుమారుడు ప్రీతం ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ వర్సిటీలో ఏరోస్పేస్ ఇజినీరింగ్ చదువుతున్నారు. ఈ ఏడాది విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్నేషనల్ స్టూడెంట్ గ్రాడ్యుయేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో అతను ప్రథమ అవార్డును గెలుచుకొని శెభాష్ అనిపించుకున్నారు. అంకుర సంస్థ ఏర్పాటులో భాగంగా ఉత్తమమైన ఆలోచనలు గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు అక్కడి ప్రభుత్వం ఏటా ఈ అవార్డును అందిస్తూ వస్తోంది.

జూదరుల అరెస్టు

పరకాల, న్యూస్‌టుడే: నడికూడ మండలం పులిగిల్ల శివారులో జూదం స్థావరంపై మంగళవారం స్థానిక పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. మరో ఐదుగురు పారిపోయారు. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి రూ.11,200 నగదు, నాలుగు ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..!



కేయూ పరిపాలన భవనం వద్ద..



హనుమకొండ బస్టాండులో..



రెడ్‌క్రాస్‌లో పాలకవర్గం, మహిళలు..

బతుకమ్మ ఉత్సవాలను మంగళవారం నగరంలో వైభవంగా నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ, హనుమకొండ ఆర్టీసీ బస్టాండు, పోలీస్ కమిషనరేట్, కాకతీయ యూనివర్సిటీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, సుబేదారిలోని రెడ్‌క్రాస్, మడికొండ కాకతీయ గేట్ వద్ద, వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై వాకర్స్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. వివిధ రకాల పూలతో భారీ బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. – న్యూస్‌టుడే బృందం



వడ్డేపల్లి కట్టపై మహిళా వాకర్స్..



కాంగ్రెస్ కార్యాలయంలో..



బతుకమ్మ ఆడుతున్న డీఎంహెచ్‌వో డా.లలిత, మహిళా ఉద్యోగులు



కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిషోర్ ఝా దంపతులు, మహిళా సిబ్బంది

చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, వరంగల్ కలెక్టర్ సత్యశారద. చిత్రంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ తదితరులు

ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే: చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని రెడ్డి వేడుకల మందిరంలో చేనేత ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డా.బండా ప్రకాశ్, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద హాజరై ప్రారంభించారు. చేనేత పరిశ్రమ ఆదుకోవడం, కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చేనేత ప్రదర్శనను త్రినగరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా జౌళి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 9 బుధవారం హనుమకొండలోని ములుగు రోడ్డు బాలుర ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య తెలిపారు. భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్ కంపెనీలో 50 ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి ద్విచక్రవాహనం, లైసెన్స్ కలిగినవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగిన అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 7893394393 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

భావితరాలకు వన్య సంపద వారసత్వాన్ని అందించాలి



మాట్లాడుతున్న భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు జాతీయ వన్య సంపద వారసత్వాన్ని అందించే బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలని భద్రాద్రి సర్కిల్ ముఖ్య అటవీ సంరక్షణాధికారి డి.భీమానాయక్ కోరారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కులో పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని కాపాడుకోకుంటే విపత్తులు చవిచూడాల్సి వస్తుందన్నారు. త్వరలో జూపార్కుకు రెండు పెద్ద పులులను తీసుకు రానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కవి గాయక సమ్మేళనంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. భద్రాద్రి సర్కిల్ నిఘా విభాగం అటవీ అధికారి కృష్ణమాచారి, విశ్రాంత డీఎఫ్‌వో పురుషోత్తం విద్యార్థులచే వన్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శ్యామ్‌సుందర్, శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్, నరేష్, రవి, బాబు, భిక్షపతి, దామోదర్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణం



తనూశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాక్సింగ్ సబ్ జూనియర్స్ పోటీల్లో హసన్‌పర్తికి చెందిన క్రీడాకారిణి శీలం తనూశ్రీ బంగారు పతకం సాధించారు. హైదరాబాదులోని షేక్‌పేట బాక్సింగ్ హాల్‌లో ఈ నెల 5నుంచి 7వరకు పోటీలు జరిగాయి. సబ్ జూనియర్స్ 67 ప్లస్ విభాగంలో తనూశ్రీ ప్రతిభ చాటారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆమెను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ఎ.నాగమణి, కోచ్ శీలం నరేంద్రదేవ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం అండ

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ముదిరాజ్‌లకు అండగా నిలిచి, వారి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి పెద్ద చెరువులో ముదిరాజ్ సంఘం పెద్దలతో కలిసి ఎమ్మెల్యే చేప పిల్లలను వదిలారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మత్స్యకారుల సంఘం నాయకులు శీలం పృథ్వీరాజ్, పిట్టల కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యానికి గురైన 34 మందికి మంజూరైన రూ.10.84 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు.

జులైవాడ, న్యూస్‌టుడే : నగరంలోని 49వ డివిజన్ రెవెన్యూకాలనీ రోడ్డు నంబర్ 6లో మురుగు కాలువలు శుభ్రం చేయడంలేదు. దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **- లక్ష్మారెడ్డి, రెవెన్యూకాలనీ**

సమాధానం : పరిశీలించి శుభ్రం చేయిస్తాం. **- కట్టస్వామి నగరపాలక జవాన్**

హనుమకొండ చౌరస్తా.: నగరంలోని 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ ఇంటి నంబర్ 1-1-343 ప్రాంతంలో దోమల నివారణ మందు పిచికారీ చేయడంలేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి. - సరళ, ప్రశాంత్‌నగర్

సమాధానం : రెండు రోజుల్లో చేయిస్తాం. **- అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సుబేదారి: నక్కలగుట్టలోని హరిత హోటల్ ఎదురుగా సందులో వీధి దీపాలు వెలగడం లేదు. ఆ ప్రాంతం రాత్రి వేళ అంధకారంగా ఉంటోంది. **- రమేష్, నక్కలగుట్ట**

సమాధానం : రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. - సరిత, ఏఈ, నగరపాలక సంస్థ

జులైవాడ: నగరంలోని 50వ డివిజన్ పోస్టల్‌కాలనీ ఇంటి నంబర్ 1-9-893 ప్రాంతంలో ఉన్న పోల్ నంబర్ పీసీఎస్9/6/4బీటీఎస్15 వీధి దీపం వెలగడం లేదు. **- ప్రసాద్, పోస్టల్‌కాలనీ**

సమాధానం : రెండు రోజుల్లో ఏర్పాటు చేయిస్తాం. **- సరిత, ఏఈ, నగరపాలకసంస్థ**

రెట్టింపు డబ్బులంటూ బురిడీ

కమలాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 6న అతడికి టెలిగ్రామ్‌లో ఓ సందేశం వచ్చింది. కొంత పెట్టుబడిగా పెడితే రెట్టింపు డబ్బులొస్తాయని నమ్మించారు. వారి మాటలను నమ్మిన విద్యార్థి వారు చెప్పిన ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా దఫదఫాలుగా మొత్తం రూ.1,08,778 పంపించాడు. డబ్బులు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన విద్యార్థి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు మంగళవారం కమలాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



స్రవంతి (ఫొటో)

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన కటాక్షపూర్‌లో చోటుచేసుకుంది. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. హౌజ్‌బుజుర్గ్ గ్రామానికి చెందిన నీలం స్రవంతి (35) తన భర్త కుమార్‌తో కలసి ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కటాక్షపూర్ చెరువు మత్తడి వద్ద అదుపు తప్పి గుంతల్లో పడడంతో స్రవంతి తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

హసన్‌పర్తి: ఇంటి నిర్మాణం కోసం ఒప్పందం కుదుర్చుకున్న డబ్బు అడిగితే దాడి చేసిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దేవన్నపేటకు చెందిన సందీప్‌కుమార్ హనుమకొండకు చెందిన చిరుసాయితో ఇంటి నిర్మాణం చేయించారు. ఇంకా రూ.16 లక్షలు బకాయి ఉందని, ఇవ్వాలని అడగడంతో గత నెల 29న సాయంత్రం చిరుసాయిని ఇంటికి పిలిపించి, గడ్డపార, కర్రతో దాడి చేశారు. బాధితుడు మంగళవారం ఫిర్యాదు ఇవ్వడంతో సందీప్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

ఆత్మకూరులో ముగ్గురిపై..

ఆత్మకూరు : వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. అక్కంపేటకు చెందిన పెండ్లి రవీందర్ బ్రిక్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం జేసీబీ విషయంలో రేగుల రాజు, రేగుల అనిల్, అమీర్‌పాషా గొడవ పడి రవీందర్‌పై రాయితో దాడి చేశారు. తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. రవీందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా

ఎస్సీ వర్గీకరణ అమలుకు సమష్టి పోరాటం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగలు సమష్టి పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్ల వెంకటస్వామి, సురేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తకొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ అమలు చేయకుండా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తీరుకు నిరసనగా బుధవారం చేపట్టిన కలెక్టర్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చింతగట్టు(భీమారం): చింతగట్టు సబ్ స్టేషన్ పరిధిలోని భీమారం చర్చి, సత్యసాయి కాలనీ, బ్యాంకు కాలనీ, యాదవనగర్, అలకానంద కాలనీ, కాకతీయనగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చింతగట్టు సబ్ స్టేషన్ ఏఈ డి.ప్రదీప్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రావణ వధ వేడుకకు ఏర్పాట్లు

మడికొండ: దసరా ఉత్సవాల్లో భాగంగా మడికొండలో రావణ వధ వేడుక ఏర్పాట్లకు మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. 40 అడుగుల ప్రతిమను తయారు చేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ కొప్పుల నవీన్‌యాదవ్, మెట్టుగుట్ట ఛైర్మన్ రఘుచందర్, బిల్ల రవీందర్, కుర్ల మోహన్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడటంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా భీందేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన టేకుమట్ల సంధ్యారాణి-అశోక్ దంపతులు ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్‌కు చెందిన ముష్కే సమ్మయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్తున్నారు. తాడికల్ పెద్దమ్మ గుడి వద్ద రహదారిపై వీరి ద్విచక్రవాహనానికి కుక్క అడ్డురావటంతో కింద పడిపోయారు. ముగ్గురు గాయపడగా.. వారితో పాటు ఉన్న చిన్నారి సురక్షితంగా బయటపడింది. క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

మత్తుతో జీవితాలు నాశనం



పోలీస్ కళా ప్రదర్శనలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అన్నారు. మంగళవారం భట్టుపల్లిలో పోలీస్ కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో, చైతన్య గీతాలతో ప్రజలను జాగృతం చేశారు. అలాగే సైబర్ నేరాలు చోటు చేసుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసి సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జె.రాజబాబు, హెడ్ కానిస్టేబుళ్లు జయరాజ్, బానోతు రాంచందర్, కళా బృందం ఇన్‌ఛార్జి నాగమణి, హెడ్ కానిస్టేబుల్ విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డు శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి పాలొన్నారు.

నేడు చలో కలెక్టరేట్

వేలేరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు చేస్తున్న అన్యాయానికి నిరసనగా బుధవారం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం వేలేరులో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశం కనకం రాజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం వల్ల మాదిగలు, ఉపకులాల వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో నాయకులు రామంచ యేసు, జోగు సారయ్య, రాజు, శ్రీకాంత్, సుధాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపడతామని అసెంబ్లీలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పి, ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్నారని ఎమార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ విలేకరుల సమావేశంలో విమర్శించారు. కలెక్టరేట్ ముట్టడికి మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

నలుగురికి సమాజ సేవ శిక్ష

కాజీపేట టౌన్: తాగి వాహనం నడిపిన నలుగురికి న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రెండు రోజులపాటు సమాజ సేవ శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపారు. ఇటీవల కాజీపేట ట్రాఫిక్ రాణా పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహిస్తుండగా లకావత్ చంప్లా, భూక్య కొమురెల్లి, నాయిని నరేష్, మర్రి చలపతి మద్యం తాగి వాహనం నడపుతూ పట్టుపడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా పైవిధంగా శిక్షణ విధించారు. శిక్ష పడినవారిని ఇన్‌స్పెక్టర్ నాగబాబు నగరపాలక సంస్థ కాజీపేట అడిషనల్ కమిషనర్ కార్యాలయానికి అప్పగించారు.

ధర్మసాగర్ మీదుగా వస్తున్న రైల్వేలైన్ మార్చాలి

ధర్మసాగర్: చిల్పూర్ మండలం నష్కల్ నుంచి కరుణాపురం, ధర్మసాగర్ మీదుగా హసన్‌పర్తి మండలానికి వెళ్లే గూడ్స్ రైల్వేలైన్‌ను మార్చాలని భూ నిర్వాసితులు కోరారు. మంగళవారం సికింద్రాబాద్‌లో దక్షణమధ్య రైల్వే సీపీవో సత్యప్రకాశ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మొదటి ప్లాన్ ప్రకారం నష్కల్ నుంచి కరుణాపురం, రాంపూర్, మడికొండ, దేవన్నపేట మీదుగా లైను వేస్తే తక్కువ భూములు అవసరం అవుతాయని, ఎక్కువ మంది రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని అన్నారు. రైల్వేశాఖకు కూడా నిధులు మిగులుతాయని పేర్కొన్నారు.

పరకాల నియోజకవర్గం

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ



పరకాల, న్యూస్‌టుడే: గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య కవచం కిట్లు అందజేస్తోందని ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆమె హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన 87 మంది కార్మికులకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎంపీ కావ్య, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత

దామెర, న్యూస్‌టుడే: మండలంలోని సింగరాజుపల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం దామెరలో పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

పరకాల: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, లైటింగ్ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అనంతరం పరకాల దామెర చెరువు, ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఛైర్‌పర్సన్ సోద అనిత, ఆర్డీవో నారాయణ, పుర కమిషనర్ నర్సింహ, తహసీల్దార్లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

దామెర, న్యూస్‌టుడే: మండలంలోని తక్కళ్లపహాడ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం చండీయాగం నిర్వహించారు. గ్రామస్థులు, అమ్మవారి దీక్షాపరులు పాల్గొన్నారు.

కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సోద

పరకాల, న్యూస్‌టుడే: పరకాల ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సోద రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ కార్యదర్శి కె.నాగయ్య ప్రకటించారు. సూరయ్య, మాణిక్యం ఏసుదాసు, బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయతీ



రాజేశ్వరికి బ్యాగు అందజేస్తున్న కండక్టర్ సాంబయ్య

పరకాల: నగదు, బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగును మహిళ బస్సులో మర్చిపోయి వెళితే కండక్టర్ అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. మంగళవారం పరకాల మండలం నాగారానికి చెందిన బిల్లా రాజేశ్వరి తన గ్రామానికి వెళ్లేందుకు స్థానిక బస్‌స్టేషన్ నుంచి జమ్మికుంట బస్సులో వెళ్లి నాగారంలో బ్యాగ్ వదిలి దిగారు. అందులో రూ. 30 వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, ఫోన్ ఉంది. కండక్టర్ కోడెపాక సాంబయ్య డిపోలో అప్పగించడంతో బాధితురాలు రాజేశ్వరికి బ్యాగ్‌ను అందజేశారు.